సామాజిక సంస్థల కృషి అభినందనీయం: ఎమ్మెల్యే


గాజులరామారం జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేయడానికి సామాజిక సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. గాజులరామారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అక్షిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువగా పేద, మధ్యతరగతి విద్యార్థులు చదువుతారని, వారిని అన్ని విధాలుగా ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అశోక్ రెడ్డి, పాక్స్ డైరెక్టర్ పరిశే శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు విజయ రామిరెడ్డి, నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, ఉపాధ్యక్షులు ఇబ్రహీం ఖాన్, గోవర్ధన్ రెడ్డి, శేఖర్, మహిళా అధ్యక్షురాలు సంధ్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గురుపాదుక పూజలో వివేకానంద్, శ్రీశైలంయాదవ్ తదితరులు

● కొంపల్లి మున్సిపాలిటీ ఎన్సీఎల్ నార్త్ కాలనీలో రాచర్ల రవిచంద్ర శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన భారతీతీర్థ మహాస్వామి గురుపాదుక పూజాకార్యక్రమంలో ఎమ్మెల్యే వివేకానంద్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మంచి గురువు సాంగత్యంలో సరైన నడవడిక అలవడుతుందన్నారు. కార్యక్రమంలో కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, మాజీ ఎంపీపీ సన్న కవిత, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, కౌన్సిలర్లు శిరీష, సన్న రవి, నాయకులు నరేందర్ రెడ్డి, వేణు, రాము, జగన్మోహన్ రెడ్డి, రామిరెడ్డి, సంతోష్ రావు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 28 వరకు ఓటరు కార్డులో మార్పులకు అవకాశం


ఎలక్ట్రోల్ రోల్స్ డ్రాఫ్ట్‌ను అందుబాటులోకి తెచ్చిన ఉప కమిషనర్ నరసింహ

కుత్బుల్లాపూర్: ఓటరు గుర్తింపు కార్డులో మార్పులు, చేర్పులపై అభ్యంతరాలుంటే దరఖాస్తు చేసుకోవాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఉప కమిషనర్ నరసింహ అన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో ఎలక్ట్రోల్ రోల్స్ డ్రాఫ్ట్ పబ్లికేషన్‌ను అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 7,31,517 మంది ఓటర్లుగా నమోదై ఉన్నారని, ఓటర్ లిస్ట్‌లో పేరు, ఇతర మార్పులు చేయాలంటే ఫామ్ 6, 7, 8, 8ఏ లను పూరించి నవంబర్ 28వ తేదీ లోపు అందజేయాలన్నారు.

నాలాను పట్టించుకోని 'ఐలా'

జీడిమెట్ల: జీడిమెట్ల ఫేజ్–3 ఎస్వీ కో ఆపరేటివ్ సొసైటీలోని నాలాలో రసాయన వ్యర్థాలు, చెత్తా చెదారాలు నిండిపోవడంతో విపరీతమైన దుర్గంధం వెలువడుతోంది. ఎప్పటికప్పుడు నాలాలోని వ్యర్థాలను తొలగించాల్సిన ఐలా మున్సిపల్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమల నుంచి ప్రతిఏటా లక్షల రూపాయలు ఆస్తిపన్ను వసూలు చేసే ఐలా అధికారులకు కనీస సౌకర్యాలు కల్పించరా అని పరిశ్రమల యజమానులు ప్రశ్నిస్తున్నారు. నాలాలో గత సంవత్సర కాలంగా చెత్తా చెదారాలు, రసాయన వ్యర్థాలు పారబోస్తున్నారు. ఈ విషయమై పలు మార్లు ఫిర్యాదు చేసినా అధికారులకు కనీసం చీమ కుట్టినట్టు అయినా లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఐలా అధికారులు పట్టించుకుని కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.


ఎస్వీ కోఆపరేటివ్ సొసైటీలో వ్యర్థాలతో నిండిపోయిన నాలా

సీఐటీయూ కార్యకర్తల నిరసన

నిజాంపేట్: క్యూబాపై అమెరికన్ సామ్రాజ్యవాద నిర్బంధాన్ని నిరసిస్తూ బాచుపల్లి మండలం సీఐటీయూ కార్యకర్తలు, నాయకులు మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా నాయకుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ సోషలిస్ట్ క్యూబాపై అమెరికా సామ్రాజ్యవాదం విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని, ఈ విషయమై ఐక్యరాజ్యసమితిలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. క్యూబాను తీవ్రవాద దేశంగా పరిగణిస్తూ ఆంక్షలు విధించడం వల్ల విదేశీ వాణిజ్యం, ఆదాయ వనరులు, ఎనర్జీ, క్రెడిట్ లావాదేవీలకు తీవ్ర అవరోధం ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రభుదాస్, ప్రకాష్, వెంకటేష్, జమీల్ తదితరులు పాల్గొన్నారు.


బాచుపల్లిలో ఆందోళన చేపట్టిన సీఐటీయూ నాయకులు

మార్కెట్‌కు దీపావళి శోభ


విక్రయానికి ఉంచిన రంగుల తోరణాలు


స్వీట్ దుకాణం వద్ద పేనీల విక్రయాలు

దీపావళి, ధనలక్ష్మి పూజల నేపథ్యంలో ఒకరోజు ముందే షాపూర్‌నగర్ మార్కెట్ జనాలతో కిక్కిరిసింది. మంగళవారం పూజాసామగ్రి, బొమ్మల కొలువు, ప్రమిదలు, ఇంటి తోరణాలు, పేనీలు, పూలను కొనుగోలు చేసేందుకు మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చినవారితో మార్కెట్ కిటకిటలాడింది.

– సుభాష్‌నగర్




షాపూర్‌నగర్ మార్కెట్‌లో పూల దుకాణాల వద్ద జనం


ప్రమిదలు కొనుగోలు చేస్తున్న దృశ్యం

డబుల్ ఇళ్ల పేరిట మోసం

కేపీహెచ్‌బీకాలనీ: డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇప్పిస్తానంటూ మహిళలను నమ్మించి సుమారు రూ.40 లక్షల వరకు వసూలు చేసి ఉడాయించాడు. ఈ ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బాధిత మహిళలు కేపీహెచ్‌బీ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు, బాధితుల వివరాల ప్రకారం.. బోయినపల్లి అల్వాల్‌లో నివాసం ఉండే వేణుగోపాల్ దాస్ అనే వ్యక్తి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించే అధికారి వద్ద పని చేస్తానని, ఇళ్లు కావాల్సిన వారికి ఇప్పిస్తానని నమ్మబలికాడు. ఆసక్తి చూపిన మహిళలను దుండిగల్ ప్రాంతంలోని ఇళ్ల వద్దకు తీసుకువెళ్లి చూపించాడు. ఒక్కో ఇంటికి రూ.2.50 లక్షలు ఇస్తే ఇంటి తాళాన్ని కూడా అందజేస్తానని చెప్పాడు. దీంతో బోయినపల్లికి చెందిన లక్ష్మి, మరికొందరు మహిళలు ఆన్‌లైన్ ద్వారా కొంత నగదు రూపంలో చెల్లించారు. వారికి నకిలీ ఇళ్ల కేటాయింపు లెటర్, ఇంటి తాళాన్ని ఇచ్చాడు. ఈ విధంగా కేపీహెచ్‌బీ కాలనీ ప్రాంతానికి చెందిన 15 మంది మహిళలు, బోయినపల్లి ప్రాంతానికి చెందిన మరికొందరు మహిళలు రూ.2.50 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు చెల్లించారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత ఇళ్లల్లోకి గృహ ప్రవేశాలు చేసుకోవచ్చని నమ్మించి డబ్బులు తీసుకొని ఉడాయించాడు. ఇళ్ల పత్రాలు తీసుకున్న వారంతా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల దగ్గరికి వెళ్లి చూస్తే అసలైన లబ్ధిదారులు ఇళ్లలో ఉండటంతో మోసపోయామనే విషయాన్ని గ్రహించారు. డబ్బులు తీసుకున్న వేణుగోపాల్ దాస్ కనిపించకపోవడంతో ఏడ్చుకుంటూ మంగళవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వద్దకు వెళ్లారు. కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావుకు ఫోన్ చేసి బాధితులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంటింటా బీజేపీ సభ్యత్వ నమోదు


కొంపల్లిలో జరిగిన పార్టీ సభ్యత్వ నమోదులో పాల్గొన్న మహిళా మోర్చా నేత సరితారావు

కుత్బుల్లాపూర్: ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సరితారావు అన్నారు. కొంపల్లి మున్సిపాలిటీలోని 11, 12, 13 వార్డుల్లో మంగళవారం బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ సభ్యత్వ నమోదు చేపట్టారు. సరితారావు మాట్లాడుతూ మేకిన్ ఇండియాతో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయన్నారు. ఈ కార్యక్రమంతో కౌన్సిలర్ సూర్యకళ, మహిళా మోర్చా నాయకులు ప్రియాంక, దీపిక, ఉష, సునీత, కావ్య పాల్గొన్నారు.


సభ్యత్వ నమోదు చేస్తున్న మల్లారెడ్డి

బీజేపీకి పెరుగుతున్న ఆదరణ

దుండిగల్: భారతీయ జనతా పార్టీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని ఆ పార్టీ మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి ఎస్.మల్లారెడ్డి అన్నారు. బౌరంపేట ఇందిరమ్మ కాలనీలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో 40 వేలు, మేడ్చల్ జిల్లాలో 1.5 లక్షల బీజేపీ సభ్యత్వ నమోదైందని, జిల్లాలో నాలుగు లక్షలు, నియోజకవర్గంలో లక్ష సభ్యత్వాల నమోదు లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నేతలు పీసరి కృష్ణారెడ్డి, ఎంబరి ఆంజనేయులు, గోనె మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీ ,బీసీల అభ్యున్నతి కోసమే సర్వే

సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) ప్రధాన ఉద్దేశం వెనుకబడిన తరగతుల, షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల, ఇతర బలహీన వర్గాల అభ్యున్నతి కోసమేనని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా అన్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పై మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి శేఖర్‌తో కలిసి సూపర్ వైజర్లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. సీపీఓ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో సర్వే ఎలా నిర్వహించాలని, డేటాను ఎలా సేకరించాలి, సర్వేలో ఎదురయ్యే సాధారణ సమస్యలను ఎలా పరిష్కరించాలనే విషయాల పై వివరంగా అదనపు కలెక్టరు గుప్తా సూచనలు చేశారు. ఎన్యూమరేటర్లు వారికి కేటాయించిన ఈబీలో ప్రతి కుటుంబాన్ని క్రమపద్ధతిలో జాబితా తయారు చేసి ప్రతి కుటుంబానికి సంబంధించిన ప్రాథమిక సమాచారం సేకరించాలన్నారు. హౌజింగ్ సర్వే పూర్తయిన వెంటనే ప్రతి ఇంటి ముఖ్య ద్వారానికి ప్రక్కన స్టిక్కర్‌ని అతికించాలన్నారు. ఎన్యుమరేషన్ సమయంలో కుటుంబ యజమాని నుంచి సేకరించిన సమాచారాన్ని



గోప్యంగా ఉంచబడతుందన్నారు. ఎన్యూమరేషన్‌లో నింపిన షెడ్యుల్ ఫారాలను జాగ్రత్తగా భద్రపరచాలన్నారు. ఎన్యుమరేటర్ నిర్దేశించిన డేటా ఎంట్రీ కేంద్రానికి వచ్చి ఆపరేటర్‌తో డేటా ఎంట్రీని పూర్తి చేయించాలన్నారు. సూపర్ వైజర్లు ఫీల్డ్‌లో ఎన్యుమరేటర్ల పనితీరును పర్యవేక్షించి అవసరమైన సహాయాన్ని అందించాలన్నారు. ఎన్యుమరేటర్లు సేకరించిన డేటాలో 10 శాతం రాండమ్ కుటుంబాలను ఎంచుకుని ఆ ఇండ్లను సందర్శించి డేటాను మరలా తనిఖీ చేయాలన్నారు. సర్వే ప్రక్రియలో కిందిస్థాయి ఎన్యూమరేటర్లకు మార్గదర్శకంగా వ్యవహరిస్తూ సహాయం అందించాలన్నారు. సర్వే సమర్థవంతంగా నిర్ణీత సమయంలో పూర్తి చేయడానికి కావలసిన అన్ని చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. అనంతరం సర్వేకు సంబంధించిన నిర్ణీత ఫారాలను ఏవిధంగా పూరించాలనే అంశం పై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తెలిపారు.

కొత్తవారికి పదవులు.. సీనియర్లు గుర్రు!

● బీజేపీలో పెరుగుతున్న అసంతృప్తి
● సస్పెన్షన్లతో కార్యకర్తల విస్మయం
● కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో అయోమయం

కుత్బుల్లాపూర్: అయినవారికి ఆకుల్లో.. కాని వారికి కంచాల్లో అన్నట్లుగా మారింది కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీజేపీపరిస్థితి. గత 30 సంవత్సరాలుగా పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న వారిని పక్కన పెట్టి కొత్తగా వచ్చిన వారికి పదవుల పంపకం చేయడంపై సీనియర్లు అంతా గుర్రుగా ఉన్నారు.. తమకు గిట్టనివారు పార్టీలో ఉండకుండా సస్పెండ్ చేస్తుండటం మరింత కలకలం రేపుతోంది. దీంతో నియోజకవర్గంలో ఇప్పటికే సీనియర్ నాయకులు సైలెంట్ కాగా.. కొత్తగా వచ్చినవారు తమ హవా కొనసాగించే దిశగా అడుగులు వేస్తున్నారు.

సీనియర్లను పక్కనపెట్టి కొత్తవారికి...

నియోజకవర్గ పార్టీ కన్వీనర్‌గా కొనసాగిన బుచ్చిరెడ్డి రాజీనామా చేయడం.. కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఖాళీగా ఉన్న ఆ స్థానాన్ని సీనియర్ నాయకుడుగా ఉన్న బక్క శంకర్‌రెడ్డికి అప్పగించారు. పార్టీ మారి వచ్చిన శేఖర్‌యాదవ్‌కు అకస్మాత్తుగా ఆ పదవిని కట్టబెడుతూ మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి కన్వీనర్ మల్లారెడ్డి నిర్ణయం తీసుకోవడంపై కార్యకర్తలు, నాయకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇలా పార్టీ మారి వచ్చిన వారికి అందలం ఎక్కిస్తుండటంతో గత కొన్ని సంవత్సరాలుగా పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న నటరాజ్ గౌడ్, నందనం దివాకర్, రాష్ట్ర మహిళా మోర్చా నాయకురాలు సులోచన, చండీ శ్రీనివాస్, పత్తి రఘుపతి, కొంపల్లి ప్రాంతానికి చెందిన చక్రధర్ అసంతృప్తిగా ఉన్నారు.

దూకుడుగా ఉన్న సతీష్‌పై వేటు

నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో అక్రమ నిర్మాణాలు, ఇతర అంశాలపై పోరాడుతూ అక్రమార్కుల గుండెల్లో గుబులు పుట్టించిన కార్పొరేషన్ అధ్యక్షుడు ఆకుల సతీష్‌ను పార్టీ నాయకత్వం సస్పెండ్ చేయడం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. మరో ఇద్దరు ప్రధాన కార్యదర్శులను కూడా అదే విధంగా సస్పెండ్ చేశారు. క్రమశిక్షణ సంఘం, షోకాజ్ నోటీస్, వివరణ తర్వాత నిర్ణయం తీసుకోవాల్సిన జిల్లా నాయకత్వం ఏకపక్షంగా వ్యవహరించి తమను సస్పెండ్ చేసిందని రాష్ట్ర క్రమశిక్షణ సంఘానికి వారు ఫిర్యాదు చేయడం విశేషం.

ఎవరికి వారే...

బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఎవరికి వారే నిర్వహించుకుంటూ పోతున్నారు. సీనియర్లు ఒకవైపు.. పార్టీ మారి బీజేపీలో చేరిన వారు మరోవైపు కార్యక్రమాలు చేపడుతూ ఒకరి కార్యక్రమాలకు మరొకరు వెళ్లకుండా ముఖం చాటేస్తున్నారు. వీరిని సమన్వయం చేసి పార్టీ కార్యక్రమాలను వేగవంతం చేయాల్సిన జిల్లా నాయకత్వం సైతం సీనియర్ నాయకుల సూచనలను పట్టించుకోవడం లేదన్న విమర్శ ఉంది. ఏది ఏమైనా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరపున పోటీ చేసి ఓడిపోయిన కూన శ్రీశైలంగౌడ్ రెండో స్థానం... పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీ ఎంపీ ఈటల రాజేందర్‌కు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో భారీ మెజారిటీ వచ్చిన విషయం తెలిసిందే. అయితే ప్రజల్లోకి పార్టీ కార్యక్రమాలను తీసుకువెళ్లడానికి నాయకత్వం పూర్తిస్థాయిలో పనిచేయడం లేదన్న విమర్శ ఉంది.

కక్షపూరితంగా వ్యవహరించడం సిగ్గుచేటు

కూకట్‌పల్లి: హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాలపై కక్షపూరితంగా వ్యవహరించడం సిగ్గు చేటని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఫతేనగర్ డివిజన్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని సమస్యలు, పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గాలికి వదిలేశారని, నిధులు లేక పురపాలికలు దిక్కులు చూస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యం ప్రజలు సమస్యలతో కొట్టుమిట్టాడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో అన్ని డివిజన్‌లలో గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన పనులు నిధుల లేమితో నేడు నత్తనడకన నడుస్తున్నాయన్నారు. ప్రజా సమస్యలపై నాయకులు, కార్యకర్తలు దృష్టి పెట్టాలన్నారు. వీధి దీపాల సమస్యలు మొదలుకొని అన్నీ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం మరింత కక్షపూరితంగా వ్యవహరించడంతో పాటు అక్రమంగా కేసులు కూడా నమోదు చేసి బీఆర్ఎస్ పార్టీని మరింత ఇబ్బందులకు గురి చేయవచ్చని, వాటిని ఎదుర్కొనేందుకు అందరం సిద్ధంగా ఉండాలన్నారు.

పారిశుధ్య కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి


పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న గూడ ఐలయ్యగౌడ్

జగద్గిరిగుట్ట: పారిశుధ్య కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లుగానీ, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లుగానీ కేటాయించాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గూడ ఐలయ్యగౌడ్ కోరారు. జీహెచ్ఎంసీ కమిషనర్లు, జోనల్ కమిషనర్లు ఇళ్లు లేని పారిశుధ్య కార్మికులను గుర్తించి వారికి ఇళ్లను కేటాయించాలని కోరారు. కరోనా సమయంలో కార్మికులు అద్దె ఇళ్లల్లో ఉండి అనేక సమస్యలు ఎదుర్కొన్నారని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని కోరారు. కార్మికులకు ఇళ్ల కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి, రాష్ట్ర అధ్యక్షుడు గుంజ శ్రీను ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేస్తామని పేర్కొన్నారు.

కాలనీల్లోని సమస్యల్ని పరిష్కరించాలి


పాదయాత్ర చేస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్నారెడ్డి

సుభాష్‌నగర్: సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు అధికారులు చొరవ తీసుకోవాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. గాజులరామారం డివిజన్ పీపీనగర్, పీఎం రెడ్డి నగర్, చిత్తారమ్మదేవినగర్, భవానీనగర్, సుందరయ్య కాలనీల్లో నెలకొన్న సమస్యలపై మంగళవారం ఆయన ఉప కమిషనర్ మల్లారెడ్డితో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ పాదయాత్రలో వివిధ బస్తీలు, కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్యూబాపై ఆంక్షలు ఎత్తివేయాలి


షాపూర్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

రంగారెడ్డినగర్: క్యూబాపై విధించి ఆర్థికపరమైన ఆంక్షలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూమేడ్చల్ జిల్లా అధ్యక్షుడు అశోక్ అన్నారు. క్యూబాపై అమెరికా ప్రభుత్వ ఆంక్షలను నిరసిస్తూ మంగళవారం షాపూర్‌నగర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. మండల అధ్యక్షుడు లక్ష్మణ్ ఆధ్వర్యంలో షాపూర్‌నగర్ రైతుబజారు నుంచి సాగర్ హోటల్ వరకు ర్యాలీ కొనసాగింది. ర్యాలీలో అంజయ్య, దేవదానం, నాగరాజు, సత్యం, శంకర్, లక్ష్మణరావు, వివిధ కంపెనీల కార్మికులు పాల్గొన్నారు.

నవంబర్ 6 నుంచి కులగణన సర్వే చేపట్టండి



సాక్షి, సిటీబ్యూరో: నవంబర్ 6 నుంచి సామాజిక, ఆర్థిక, కుల గణన సర్వే చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేలో అన్నింటినీ చేర్చాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మంగళవారం సచివాలయం కేంద్రంగా అన్ని జిల్లా కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి ఖమ్మం జిల్లా నుంచి పాల్గొనగా, వీసీలో మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా నుంచి కలెక్టర్ గౌతమ్, జిల్లా అదనపు కలెక్టర్లు రాధికా గుప్తా, విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్లకు కులగణనపై భట్టి విక్రమార్క దిశానిర్దేశం

కలెక్టర్లు సమగ్ర కులగణన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. కలెక్టర్లు ఎన్యుమరేటర్లుగా ఉపాధ్యాయుల సేవలను వినియోగించుకోవాలని ఆయన పేర్కొన్నారు. వ్యక్తిగతంగా పర్యవేక్షించడం, ప్రతి ఎన్యుమరేటర్‌కు ఎన్యుమరేషన్ బ్లాక్ మ్యాప్, సర్వే షెడ్యూల్, ఎన్యుమరేటర్స్ మాన్యువల్ అందే విధంగా చూసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ఎన్యుమరేటర్లకు సమర్థవంతంగా శిక్షణ ఇవ్వాలని, వారికి కేటాయించిన సర్వే షెడ్యూల్‌లో చేర్చబడిన 50 ప్రశ్నలపై పూర్తి అవగాహన ఉండే విధంగా జిల్లా కలెక్టర్లు వారికి శిక్షణ ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. ఎన్యుమరేటర్లు ముందుగా ఇంటి జాబితాను పూర్తి చేసి, పాఠశాల వేళల తర్వాత ప్రతిరోజూ 5–7 ఇళ్లను సందర్శించడం ద్వారా ఇంటి షెడ్యూల్‌ను ప్రారంభించాలని, సర్వేలో నిర్వహణను పటిష్ఠంగా చేపట్టి నాణ్యమైన అవుట్‌పుట్ పొందడానికి అవసరమైన సమయాన్ని కేటాయించాలని ఆయన పేర్కొన్నారు. ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బందికి ఆకర్షణీయమైన వేతనం చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. సర్వేను నిర్వహించడంలో క్షేత్ర స్థాయిలో గ్రామాలు, పట్టణాలను సందర్శించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సర్వే నిర్వహణపై ప్రతి రోజు పర్యవేక్షక సిబ్బందితో సమీక్ష నిర్వహించాలన్నారు. సర్వే గురించి టామ్ టామ్ బీట్ ద్వారా ప్రతి గ్రామంలో ప్రకటించాలన్నారు. సామాజిక కుల గణనను ప్రచారం చేయడానికి మీడియాను సమర్థవంతంగా ఉపయోగించాలని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, అనసూయ (సీతక్క), జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఉప ముఖ్యమంత్రి స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ , సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ హరీష్ పాల్గొన్నారు.